# వింతజంతువు

నా దగ్గర ఒక వింత జంతువుంది; సగం పిల్లి, సగం గొర్రె, చచ్చిపోతూ మా నాన్న వదలిన ఆస్తి, అయితే దాని ప్రస్తుత రూపం నా కాలంలోనే దానికి ఏర్పడింది. అంతకుపూర్వం అది పిల్లిగాకాక చాలామట్టుకు గొర్రెగానే ఉండేది. పిల్లిజాతినుండి తలా, గోళ్ళూ—గొర్రెజాతినుండి ఒడ్డూ, పొడుగూ, ఆకారమూ దానికి సంక్రమించాయ్. రెండిటినుంచీ కళ్ళు భీకరంగా, ఎప్పటికప్పుడు మారిపోతూ, బొచ్చు మెత్తగా, చర్మానికి దగ్గరగా గమనం దాట్లు వెయ్యడం, ప్రాకడం, కిటికీమీద ఎండలో కూర్చుని అది బంతిలాగ ముడుచుకుపోయి గుర్రుపెడుతుంది. పచ్చిక బయలులో పిచ్చెత్తినట్లు గంతులువేస్తూ ఒకంతకీ దొరకదు. పిల్లలను చూస్తే పారిపోతుంది; గొర్రెలమీద తిరగబడుతుంది. వెన్నెల రాత్రులలో ఇంటి పైకప్పుమీద సంచరించడం దానికి సరదా, అది మ్యావుమనలేదు. ఎలకలంటే అసహ్యం. కోళ్ళ తట్టదగ్గర గంటలకొద్దీ మాటు వేస్తుంది కాని యెప్పుడూ ఒక్క కోడిని కూడా చంపలేదు.

దానికి నేను పాలుపోస్తూ ఉంటాను. క్రూరమృగంవలె దంతాల సందులనుంచి పెద్దపెద్ద పీల్పులతో పాలు తాగుతుంది. అదంటే చిన్నపిల్లల కందరికి గొప్ప వేడుక అని వేరే చెప్పనక్కరలేదు. ఆదివారం ఉందరూ వచ్చే పూట మోకాళ్ళ మీద ఆ జంతువును పెట్టుకొని కూర్చుంటాను, గ్రామంలోని పిల్లలందరూ నాచుట్టూ నిలుచుంటారు. పిల్లలంతా వింతవింత ప్రశ్నలు వేస్తారు. మానవమాత్రులెవ్వరూ వాటికి జవాబులు చెప్పలేరు. ప్రపంచంలో ఇలాంటి జంతువు ఒక్కటే ఎందుకుండాలి? అది నా దగరే ఉండడం ఎంచేత? ఇది వరకెప్పుడైనా ఇటువంటి జంతువుండేదా? ఇది చచ్చిపోతే ఏమవుతుంది? దీనికి ఒంటరితనం అనిపించదా? పిల్లల్నెందుకు పెట్టలేదు? దీని పేరేమిటి? ఇట్టివే ఎన్నో ప్రశ్నలు—

జవాబులివ్వడానికి నేను ప్రయత్నించను. జంతువును వొళ్ళో పెట్టుకొని అలాగే కూర్చుంటాను. పిల్ల లొక్కొక్కప్పుడు తమతో పిల్లులను తెస్తారు. ఒకసారి

రెండు గొ్రెల్నికూడా తెచ్చారు. కాని వారనుకున్నదానికి విరుద్ధంగా నా జంతువు బంధువులను గుర్తించలేకపోయింది. జంతువులు తమ మృగాల కళ్ళతో పరస్పరం తేరిపార చూసుకున్నాయి. ఎవరి బతుకు వాళ్ళదే అనుకున్నాయి.

నా వొళ్ళో కూర్చున్నప్పుడు నా జంతువుకి భయంగాని, వేటాడే ఉత్సాహం గాని ఉండవు. నన్ను అదుముకున్నప్పుడు దానికెక్కడలేని సంతోషమూ వస్తుంది. తాను ఎవరిమధ్య పెరిగిందో ఆ కుటుంబంపట్ల ఎప్పుడూ విశ్వాసంగా ఉంటుంది. ఇందులో పెద్ద విశేషం ఏమీలేదు. లోకంలో తనకు సవతి బంధువులు చాలామంది ఉన్నప్పటికీ రక్తబంధువు లెవరూ లేకపోవటంవల్ల ఈ జంతువు మా ఇంటినే కని కనిపెట్టుకొని ఉంటుంది. ఇక్కడ దానికి దొరికిన ఆశ్రయాన్ని పవిత్రంగా చూసు కొంటుంది.

ఒక్కొక్కప్పు డీ జంతువు నా చుట్టూ చూస్తూ నా కాళ్ళని చుట్టుకుంటూ ఎప్పటికీ నన్ను వదలకపోతే నవ్వక తప్పేదికాదు. గొ్రెగానూ, పిల్లిగానూ ఉన్నది చాలక కుక్కగాకూడా ఉండాలనుకుంటుందది. అందరివలెనే నాకుకూడా అప్పు డప్పుడు వ్యవహారపు చిక్కులు తటస్థపడి, ఏమవుతుందో ఏమిటో అనే ఆందోళనలో నేను పడిపోయి అన్నిటికీ తెగించుకొని వాలు కుర్చీలో కూర్చున్న సమయంలో ఈ జంతువు నా వొళ్ళోనే వుంటుంది. దానివైపు చూస్తే పొడుగాటి దాని మీసాలనుంచి కన్నీళ్లు నావా? దానివా? నిజంగా ఈ పిల్లి కి గొ్రెల ఆత్మతోబాటు మనుష్యుల ఆశ యాలు కూడా ఉన్నాయేమో? మా నాన్న నాకు వదలిపెట్టిన ఆస్తి స్వల్పమే కాని ఈ ఆస్తి అంత కొట్టివేయదగ్గదికాదు.

గొ్రెల్లోనూ, పిల్లుల్లోనూ కనబడే ఆరాటం, వేరువేరు రకాలదే అయినా ఈ జంతువులోనూ ఉంది. అందుచేత దీని చర్మం దీనికి చాలనట్లుంటుంది. ఒక్కొక్క ప్పుడీ జంతువు నా పక్కని కుర్చీమీది కురికి, తన ముందుకాళ్ళు నా భుజాలమీద వేసి నా చెవిదగ్గర తన ముట్టె చేర్చుతుంది—అచ్చంగా నాతో ఏవో మాట్లాడదలచు కున్నట్టే నిజంగా ఆ తరువాత తన తల తిప్పి నా మొగం వైపు చూస్తుంది. తాను చెప్పింది నేను బోధపరచుకొన్నానో లేదో చూడడానికి. దాన్ని సంతోష పెట్టడానికిగాను నేనుకూడా అర్థమయిందన్నట్లుగా నటించి తల ఆడిస్తాను. అప్పుడది నేలమీది కురికి సరదాగా ఇల్లంతా నాట్యం చేస్తుంది.

బహుశా ఈ జంతువుకి కసాయివాడి కత్తివల్ల విముక్తి కలుగుతుందేమో। కాని ఇది నా పూర్వుల ఆస్తి కాబట్టి ఇట్టి పని చెయ్యకూడదు. అంచేత దానంత అదే ఊపిరి వదలివేసే అదను వచ్చేదాకా వేచుకొని ఉండవలసిందే. అయినా అప్పుడప్పుడీ జంతువు మనుష్యజ్ఞానంతో నావైపు చూసి ఇద్దరం ఒకేసారిగా దేన్ని గురించి ఆలోచిస్తున్నానేమో యేదీ ఆ పని చేసి చూడూ అన్నట్టుగా మొగం పెడుతోంది.

మూలం: Franz Kafka

ముద్రణ: జ్యోతి 1947 డిసెంబరు

Franz Kafka (1883—1924) జర్మన్ నవలాకారుడు, వ్యాసకర్త. చెకోస్లవేకియా రాజధాని ప్రాహాలో యూదు కుటుంబంలో జన్మించాడు. స్పష్టతకూ సూటిదనానికీ పేరు పొందిన వచన పద్ధతి ఇతనిది. ఏకాకిగా ఆందోళనతో ఆర్తితో దోష భావ భారంతో కుంగి వంగిపోయిన ఆధునిక మానవుడు సంచరించే ప్రపంచాన్ని చిత్రిస్తాడు. ఆ ప్రపంచం ఎంత వాస్తవమైనదిగా కనిపిస్తుందో అంత స్వాప్నికమైనది. కాఫ్కా రచనలలో The Trial (1952), The Castle (1926) Amerika (1927) ముఖ్యమైనది. అతని డైరీలు (1910—1913) కూడా ముఖ్యమైనవే.